క్లుప్తంగా

గృహ నిర్మాణాలు పూర్తి చేయించాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో గృహ నిర్మాణ లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకునేలా అధికారులు, వలంటీర్లు కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన మండల హౌసింగ్ ఏఈ సుమంత్‌తో కలిసి మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో పర్యటించి లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయంలో అధికారులు, ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో 35 మంది లబ్ధిదారులు ఉండగా నిర్మాణదశ ప్రారంభం కానివి తొమ్మిది, వివిధ దశల్లో 26 ఉన్నట్లు ఏఈ తెలిపారు. వీరి వెంట హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ రంగన్న, గ్రామ వలంటీర్లు ఉన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి



పోలకల్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: గ్రామాల్లో వారంలో మూడు రోజులు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు. శనివారం ఆయన మండల పరిధిలోని పోలకల్, ఇనగండ్ల గ్రామాల్లో సర్పంచులు మాదక్క, ఇమ్మానియేల్ చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళ, గురు, శనివారాల్లో ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేట్టాలన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు



పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, డీఈఈ మొయినుద్దీన్

కల్లూరు: ఓహెచ్‌ఆర్‌ఎస్ నూతన ట్యాంక్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఎ.గోకులపాడు గ్రామంలో నిర్మిస్తున్న ఓహెచ్‌ఆర్‌ఎస్ ఫౌండేషన్ స్టీల్ పనులను శనివారం డీఈఈ మెయినుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.48 లక్షల నిధులతో 60 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వారి వెంట ఏఈ శ్రీనాథ్‌రెడ్డి ఉన్నారు.

జాబ్ కార్డు ఉన్నవారందరికీ పనులు కల్పించాలి

కల్లూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్నవారందరికీ పనులు కల్పించాలని ఏపీఓ మద్దేశ్వరమ్మ మేటీలను, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో మండలంలోని అన్ని గ్రామాల మేటీలకు ఉపాధి హామీ పథకం పనుల్లో జరుగుతున్న మార్పులపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం వస్తుందని కూలీలకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో పండ్ల తోటలు, పూల తోటలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను చిన్న, సన్నకారు రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ మధుసూదన్ రావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కేసీకి నీరు విడుదల



సుంకేసుల రిజర్వాయర్

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శనివారం 1930 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

గడివేముల: అదనపు కట్నం కోసం వివాహితను వేధించిన కేసులో ఆమె భర్త, అత్త, మామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన షేక్ మదీహాను ఐదేళ్ల క్రితం మిడుతూరు మండలం తలముడిపి గ్రామానికి చెందిన మహబూబ్ బాషాకు ఇచ్చి వివాహం చేశారు. ఆరు నెలలు బాగా ఉన్నారు. ఆ తరువాత తాగుడుకు బానిసైన భర్తతో పాటు అత్త, మామ అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించారు. విసుగు చెందిన మదీహ.. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త మహబూబ్ బాషాతో పాటు అత్త ముర్తుజాబీ, మహమ్మద్ ఉశేన్‌లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధికే పెద్దపీట

- సర్వసభ్య సమావేశంలో పాలకవర్గం ఏకగ్రీవ ఆమోదం
- రెండేళ్లలో రూ.720 కోట్లతో కర్నూలులో అభివృద్ధి పనులు
- నగర మేయర్ బీవై రామయ్య



మాట్లాడుతున్న నగర మేయర్ బీవై రామయ్య



సమస్యలను సభ దృష్టికి తెస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు (టౌన్): మరోసారి అభివృద్ధి పనులకే కర్నూలు నగరపాలక సంస్థ పాలకవర్గం పెద్దపీట వేసింది. రూ.17 కోట్లు విలువ చేసే పనులకు ఆమోదం తెలిపింది. నగరమేయర్ బీవై రామయ్య అధ్యక్షతన శనివారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో నగరపాలక సర్వసభ్య సమావేశం జరిగింది. కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్, డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుకా, నాయకల్లు అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్న ఈ సమావేశంలో నగరంలోని వివిధ కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు 65 అంశాలపై చర్చ సాగింది. ప్రారంభంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 8 వ వార్డు కార్పొరేటర్ పరమేష్, 14 వ వార్డు కార్పొరేటర్ షేక్ జకియా అక్సారీలు తమ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టడం లేదంటూ ఆందోళన చేయగా మేయర్ స్పందించారు. పార్టీలకు అతీతంగా వార్డుల్లో పనులు చేపడుతున్నామని, టీడీపీ కార్పొరేటర్ వార్డులో రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. యూజర్‌చార్జీల విషయాన్ని కొంత మంది కార్పొరేటర్లు లేవనెత్తగా 50 శాతం తగ్గించినట్లు మేయర్ స్పష్టం చేశారు.

అధికారుల పనితీరుపై ఎమ్మెల్యేలు ఆగ్రహం

➤ నగరంలో అనేక చోట్ల రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ఏంచేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని ప్రశ్నించారు. ఖాళీ స్థలాలు సంరక్షించాలని పదే పదే చెబుతున్నా.. స్పందన లేదన్నారు. ఓపెన్ సైట్లను కాపాడుకుందామన్నారు. వీకర్ సెక్షన్ కాలనీలో డిస్పోజల్ డ్రెయిన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

➤ నగరంలోని పలుచోట్ల డబుల్ అసెస్‌మెంటు సమస్యలు వస్తున్నాయని, వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సుద్దవాగు సమస్యను పరిష్కరించడంలో ఇరిగేషన్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీ కెనాల్‌ను శుభ్రం చేయాలని, మెష్ ఏర్పాటు చేయాలని చెప్పినా స్పందించడం లేదన్నారు.

➤ తన నియోజకవర్గానికి సంబంధించిన మూడు వార్డుల పరిధిలో పనులు సక్రమంగా జరగడం లేదని, సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వరా అని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అధికారులను ప్రశ్నించారు. 9 నెలలుగా వీకర్ సెక్షన్ కాలనీ, సంతోష్‌నగర్ వద్ద మురుగు నీరు నిలిచిపోతుంది. ఈసమస్యను పరిష్కరించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

➤ 41 వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, 40 వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, 26 వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతా రెడ్డి, 28 వ వార్డు కార్పొరేటర్ నారాయణ రెడ్డి, 29 వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి, 38, 39 వార్డు కార్పొరేటర్లు సాంబశివారావు, గిప్సన్‌లు వివిధ అంశాలపై మాట్లాడారు.

రాష్ట్రంలోనే ఆదర్శంగా కర్నూలు

తమ పాలకవర్గం ఏర్పడిన రెండేళ్లలోనే కర్నూలు నగరంలో రూ.720 కోట్లు ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, అందులో కొన్ని ప్రస్తుతం జరుగుతున్నాయని మేయర్ అన్నారు. అయితే, ఈ అభివృద్ధి టీడీపీ నాయకులకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే కర్నూలు నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. రూ.28 కోట్లతో చేపట్టిన నూతన నగరపాలక కార్యాలయం నిర్మాణం పూర్తి కావచ్చిందన్నారు. సమావేశంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ , అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఆరోగ్యశాఖ అధికారులు విశ్వేశ్వర రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం ప్రారంభం



మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి

పాణ్యం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా డీపీఓ మంజువాణి అన్నారు. శనివారం కొణిదేడు, కొలూరు గ్రామాల్లో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి 17 శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరై కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీల గురించి వివరించారు. పీఎం నరేంద్రమోడీ ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆయా శాఖల అభివృద్ధిపై ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయం, ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్, విద్య, ప్రధానమంత్రి పౌష్టికాహారం తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, మోడల్ స్కూల్ విద్యార్థులు నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్, సర్పంచ్ సువార్తమ్మ, ఎంపీటీసీ సభ్యులు రవిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీఎస్‌ఓ వెంకటరాముడు, జిల్లా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ జగదీష్ చంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్, పరిశ్రమల జీఎం శ్రీనివాసయాదవ్, సీడీపీఓ చంద్రకళ, సోషల్ వెల్ఫేర్ డీఎస్‌డబ్ల్యూఓ చింతామణి, ఎంపీడీఓ దస్తగిరి, తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఏపీఎం ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణనను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: కుల గణనను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శనివారం మండలంలోని గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు అధికారులు కుల గణనపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ డిసెంబర్ 9 నుంచి ఇంటింటికి వెళ్లి కుల గణన చేపట్టాలని సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు సూచించారు. సర్వే యాప్‌లో పొందుపరిచిన వివరాలన్నింటినీ ఆయా కుటుంబాల సభ్యులతో మాట్లాడి వేలిముద్రలు వేయించడంతో పాటు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వేలిముద్ర వేయాలన్నారు. అనంతరం సర్వే అంశాలపై మాస్టర్ ట్రైనర్ శివన్న అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ మన్సురుద్దీన్, ఎస్‌ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సీఐ మన్సురుద్దీన్ సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలిసి ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకోవద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆటోలను ఎక్కడపడితే అక్కడ రోడ్లపై ఆపరాదన్నారు. వాహనాలకు పత్రాలను, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రక్తహీనతపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న రాష్ట్రీయ బాలస్వాస్త్య అధికారిణి హేమలత

కోడుమూరు: బాలికలు ప్రతిరోజు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా చక్కటి ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని రాష్ట్రీయ బాలస్వాస్త్య అధికారిణి హేమలత సూచించారు. శనివారం కోడుమూరులోని ప్రాథమిక పాఠశాలను హేమలత సందర్శించి రక్తహీనతపై బాలికలకు అవగాహన కల్పించడంతో పాటు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేశారు. పోషక విలువలు లేని ఆహారం తీసుకోవడం రక్తహీనత తలెత్తుతుందని, రక్తహీనత వల్ల అలసట, చికాకు, ఆకలి లేకపోవడం, కళ్లు తిరగడం, చదువు, ఆటలపై అనాసక్తి ఏర్పడుతుందని హేమలత బాలికలకు వివరించారు. కావున బాలికలు మంచి పౌష్టికాహారాన్ని తీసుకుని రక్తహీనత సమస్య తలెత్తకుండా చూసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఉమాభాయి, ఏఎన్‌ఎంలు శిరీషా, నాగమణి, ఆశాలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

కల్లూరు: అర్బన్ పరిధి 29వ వార్డులో రూ.30 లక్షలతో రోడ్డు నిర్మాణణ పనులకు శనివారం స్థానిక కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి కాలనీ వాసులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వార్డులోని మహమ్మద్ నగర్, వాసు నగర్, సోమేశ్వరి నగర్, రామేశ్వర నగర్, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంతంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సహకారంతో రోడ్లు వేస్తున్నామన్నారు. రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, సకాంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆడపిల్లల పట్ల వివక్షత చూపరాదు



కోడుమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైకేపీ సిబ్బంది, మహిళలు

కోడుమూరు రూరల్: సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్షత చూపరాదని ఏపీఎం పుష్పావతి సూచించారు. శనివారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమం సందర్భంగా ఆడపిల్లల పట్ల వివక్షత చూపరాదంటూ, బాల్య వివాహాలను అరికట్టాలని కోరుతూ పట్టణంలో పొదుపు మహిళలతో కలిసి వైకేపీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ సమాజంలో మగ పిల్లలతో పాటు, ఆడ పిల్లలను సమానంగా పెంచాలని, ఉన్నత చదువులు చదివించాలన్నారు. మహిళల రక్షణకై ప్రభుత్వం అనేక చట్టాలను అమలులోకి తెచ్చిందన్నారు. ముఖ్యంగా దిశ చట్టం మహిళల రక్షణకై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని, ఏదైనా ఆపదలో ఉన్న సమయంలో దిశ చట్టాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ క్రిష్టారెడ్డి, మండల సమాఖ్య సభ్యులు, మహిళా పోలీసులు, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ వివక్షత నివారణకు కృషి

సి.బెళగల్: లింగ వివక్షత నివారణకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమాన్ని మండల వైకేపీ ఏపీఎం వెంకటస్వామి నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఈఓఆర్డీ సందీప్, హెల్త్, పోలీస్ సిబ్బంది జెండర్ సమస్యలు, మహిళా హక్కులు, విధులు పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.



సి.బెళగల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని రేమట గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి, సంక్షేమ బుక్ లెట్లను అందించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని పాలన సాగిస్తున్నారన్నారు. కుల, మత, రాయకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చిన ఘనత జగనన్నదేనన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఓర్వలేని టీడీపీ నాయకులు అబద్ధాలను చెప్పి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అలాంటివి నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. మంచి చేసే ప్రభుత్వాన్నే మరోసారి ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ఎస్.ప్రసన్నకుమార్, మౌలాలి, వైస్ ఎంపీపీ నెహిమియా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుదర్శనరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ తిరుమల్ రెడ్డి, నాయకులు ఎస్.సంపత్‌కుమార్, సురేష్, ఆర్.కొంతలపాడు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మహాసభ బ్రోచర్ ఆవిష్కరణ

కల్లూరు: ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగ ఏర్పడి 10 ఏళ్లయిన సందర్భంగా శనివారం బుధవారపేటలోని కార్యాలయంలో సామాజిక న్యాయ మహాసభ బ్రోచర్‌ను ఫోరం అంతర్జాతీయ అధ్యక్షుడు గడ్డం బాపిరాజు ఆవిష్కరించారు. డిసెంబర్ 7న విజయవాడ తాడిగడపలోని అనుమోలు గార్డెన్స్‌లో సామాజిక న్యాయ సభకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో జిల్లా కో-ఆర్డినేటర్ జయరాజు, ప్రశాంత్, ఎమ్మార్పీస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి, సామాజిక కార్యకర్త పూలదాసు జగన్, బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బుచ్చి కిరణ్ పాల్గొన్నారు.

నగదురహిత లావాదేవీలను కొనసాగించాలి

సి.బెళగల్: గ్రామ సచివాలయాల్లో నగదు రహిత లావాదేవీలను పూర్తి స్థాయిలో కొనసాగించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి పీఎస్‌లతో సమావేశం నిర్వహించి, కార్యాలయాల్లో నగదు రహిత లావాదేవీల నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో మురుగునీరు రోడ్లపై పారకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

కల్లూరు: ఈ నెల 27, 28 తేదీలలో విజయవాడలో నిర్వహించనున్న కార్మిక రైతు ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరావు కోరారు. శనివారం మండలంలోని చిన్నటేకూరు, పెద్దటేకూరు, బొల్లవరం, బస్తిపాడు గ్రామాల్లో కరత్రాలు విడుదల చేసి పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

లష్కర్ల నిర్లక్ష్యంతో పంట నష్టం



చిందుకూరులో దెబ్బతిన్న మినుము పంటను చూపుతున్న రైతు

గడివేముల: కేసీ కెనాల్ లష్కర్ల నిర్లక్ష్యంతో మండల పరిధిలోని చిందుకూరు గ్రామానికి చెందిన కౌలు రైతు మానికింది నాగేషులు పంటకు నష్టం జరిగింది. రైతు నాగేషులు గ్రామ పొలిమేరలో 2.75 ఎకరాల భూమిని రూ.75 వేలకు కౌలుకు తీసుకున్నాడు. రూ.1.30 లక్షలు పెట్టుబడి పెట్టి మినుము, కంది సాగు చేశాడు. పది రోజుల్లో కోత కోద్దాముకున్న సమయంలో కేసీ కెనాల్ అధికారులు అవగాహన లేకుండా కేసీ కెనాల్‌కు పరిమితికి మించి నీటి వదలడంతో కాల్వ ఎక్కిపారి పొలమంతా మునిగిపోయిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. చేతికొచ్చిన మినుము పంట తడిసి కుళ్లిపోవడంతో దాదాపు రూ.3 లక్షల దాకా నష్టం జరిగిందని రైతు వాపోయాడు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన లష్కర్లపై చర్యలు తీసుకుని, పంట నష్ట పరిహారం అందించాలని రైతు కోరుతున్నాడు. కాగా ఈ విషయమై కేసీ కెనాల్ జేఈ విజయ్‌కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా రైతు నీటిని పారించుకునేందుకు మెయిన్ కెనాల్ పక్కన కోపు కాల్వ తీసుకున్నాడని, ఆ కోపు కాల్వ నుంచి సీబీజీ నీటితో పొలం నీట మునిగిందని వివరించారు.

విజేతలు పశ్చిమగోదావరి, కడప జట్లు





చాంపియన్ ట్రోఫీలు అందుకుంటున్న పశ్చిమగోదావరి జిల్లా బాలికలు, కడప బాలుర జట్టు

కర్నూలు (టౌన్): నగర శివారులోని మిలటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు శనివారం ముగిశాయి. రాష్ట్ర స్థాయి అండర్-17 బాలుర విభాగంలో కడప జిల్లా, బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్లు చాంపియన్‌లుగా నిలిచాయి. అండర్-17 బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లా ద్వితీయ, విజయనగరం జిల్లా తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో కడప ద్వితీయ, తూర్పు గోదావరి జిల్లా తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్ -19 బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా ప్రథమ, పశ్చిమగోదావరి జిల్లా ద్వితీయ, కడప జిల్లా తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు జిల్లా ఉప విద్యాశాఖాధికారి హనుమంతరావు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాలుగవ పట్టణ సీఐ శ్రీరామ్, ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ బేతం క్రిష్టుడు, పోటీల రాష్ట్ర పరిశీలకులు నాగశిరీషా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.జోసఫ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మసీ వారోత్సవాలు



విద్యార్థులతో సిబ్బంది

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. విద్యార్థులకు ఫార్మసీ రంగం ప్రాధాన్యత, పోటీ ప్రపంచంలో ఫార్మసీ పాత్ర తదితర వాటిపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి తెలిపారు.